## న్యూ ఇయర్ వేడుకలపై ఆంక్షలు



న్యూ ఇయర్ వేడుకలపై పోలీసులు ఆంక్షలు విధించారు. ప్రజలంతా సంబురాలు చేసుకోవచ్చని పేర్కొంటూనే, అదే సమయంలో వేడుకల పేరిట హద్దు దాటి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్ట్‌లు ఏర్పాటు చేశామని, నిరంతర డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తామని, స్పెషల్ యాక్షన్ టీంలు ఆదివారం సాయంత్రం నుంచే రంగంలోకి దిగుతామని సీపీ మహంతి చెప్పారు. అర్ధరాత్రి రోడ్లపైకి వచ్చే హంగామా చేసే వారిపై కఠినంగా వ్యవహరించడమే కాక కేసులు పెట్టేందుకు సిద్ధమయ్యారు. కాగా, ఆదివారం సాయంత్రం 6 నుంచి సోమవారం ఉదయం 5 గంటల వరకు నగర శివారులోని తీగల వంతెన, లోయర్ మానేరు డ్యాం కట్టపైకి వెళ్లేందుకు అనుమతించబోమని, అక్కడ వేడుకల నిర్వహణను నిషేధించినట్లు సీపీ అభిషేక్ మహంతి తెలిపారు.



సర్వసభ్య సమావేశం అనంతరం ఎజెండా అంశాలను వెల్లడిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

# చివరి ఆయకట్టుకు నీరందేనా..?

- మధ్య, దిగువ మానేరులో 42 టీఎంసీలు
- 27 టీఎంసీలే వాడుకునే అవకాశం
- నేడు రెగ్యులేటర్ వద్ద నీటిని విడుదల చేయనున్న మంత్రి పొన్నం ప్రభాకర్
- ఆన్-ఆఫ్ పద్ధతిలో ప్రతి రోజు 4 వేల క్యూసెక్కులే రిలీజ్
- దిగువన 8.09 లక్షల ఆయకట్టు
- టేలెండ్‌కు అందడం కష్టమే అంటున్న రైతులు
- ఆరుతడి పంటలే వేసుకోవాలని అధికారుల సూచన

**నేటి నుంచి ఎల్ఎండీ నీటి విడుదల**



**ఎట్టకేలకు యాసంగి సాగుకు నీరివ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. అల్గునూర్ నుంచి సూర్యాపేట వరకు ఉన్న సుమారు 8.09 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించాలని నిర్ణయించింది. ఈమేరకు ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఎల్ఎండీ జలాశయం నుంచి దిగువ ఆయకట్టుకు మంత్రి పొన్నం ప్రభాకర్ నీటిని విడుదల చేస్తున్నారు. మధ్యమానేరు, దిగువ మానేరు జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని ఆన్-ఆఫ్ పద్ధతిలో ప్రతి రోజూ 4వేల క్యూసెక్కులు మాత్రమే విడుదల చేస్తుండగా, ఈ సారి చివరి ఆయకట్టుకు నీరందడం కష్టమేనని రైతులు వాపోతున్నారు.**

కరీంనగర్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : యాసంగి సాగుకు నీరివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవల ఎల్ఎండీ కాలనీలో జరిగిన సమావేశంలో ప్రాజెక్టు ఉన్నతాధికారులు వచ్చే నెల ఒకటి నుంచి నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. అయితే ఒకరోజు ముందే రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం సాయంత్రం 4 గంటలకు దిగువ ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్నారు. నీటి విడుదలకు సంబంధించి సందేహాలు ఉండగా, నీటి పారుదల శాఖ అధికారులు ఒక షెడ్యూల్ నిర్ణయించుకున్నారు. ఆన్-ఆఫ్ పద్ధతిలో ఏడు రోజుల పాటు దిగువ కాకతీయ కాలువ 146వ కిలోమీటరు నుంచి 284వ కిలో మీటరు వరకు, 8 రోజులపాటు 284 కిలో మీటరు కింద ఉన్న ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. దిగువ ఆయకట్టుకు మధ్యమానేరు, దిగువ మానేరు జలాశయాల్లో ఉన్న నీటిని మాత్రమే వాడుకోవాలని నిర్ణయించారు. ప్రస్తుతం మధ్యమానేరులో 23 టీఎంసీలు, దిగువ మానేరులో 19.6 టీఎంసీల చొప్పున 42 టీఎంసీల వరకు అందుబాటులో ఉన్నది. అయితే అందు లో కేవలం 27 టీఎంసీల నీటిని మాత్రమే వాడుకునే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. అధికారులు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నారు. కరీంనగర్ జిల్లా అల్గునూర్ నుంచి సూర్యాపేట జిల్లా వరకు ఉన్న దిగువ కాకతీయ కాలువ పరిధిలో 8.09 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ మొత్తానికి ప్రతి రోజు 4 వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు.

### చివరి ఆయకట్టుకు కష్టమే

నీటి విడుదలకు అధికారుల ప్రస్తుత ప్రణాళికను చూస్తే చివరి ఆయకట్టుకు నీరందడం కష్టమనే చెప్పవచ్చు. గత యాసంగి, వానకాలం పంటలకు అప్పటి ప్రభుత్వం ప్రతి రోజు 6 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసింది. దీంతో చివరి ఆయకట్టుకూ నీరందింది. ఇప్పుడు కేవలం 4 వేల క్యూసెక్కులే ఇస్తున్న నేపథ్యంలో మొదటి ఆయకట్టు రైతులకు కూడా నీరు సరిపోయే పరిస్థితి కనిపించడం లేదు. కరీంనగర్ జిల్లా పరిధిలో గత రెండు పంటలకు అందిన నీటిని పరిశీలిస్తే హుజూరాబాద్ నియోజకవర్గంలో వానకాలం 4.55 టీఎంసీల నీటిని 88,558 ఎకరాలకు అందించారు. యాసంగిలో 5.30 టీఎంసీల నీటిని 78,716 ఎకరాలకు అందించారు. దీంతో చివరి ప్రాంతంలో ఉన్న జమ్మికుంట మండలం నాగారం, బిజిగిరి షరీఫ్ వంటి గ్రామాలకు కూడా పూర్తి స్థాయిలో నీరందింది. అదే మానకొండూర్ నియోజకవర్గంలో చూస్తే డీబీఎం 2 నుంచి డీబీఎం 14 వరకు 38,662 ఎకరాలకు రెండు పంటలకు నీరందించగలిగారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. గతంలో డిసెంబర్ 28 నుంచి ప్రతి రోజు 6 వేల క్యూసెక్కుల చొప్పున ఏప్రిల్ 14 వరకు



నీటిని అందించారు. ఈ సారి డిసెంబర్ 31 నుంచి మార్చి 30 వరకు రోజుకు 4 వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తున్నది. గతేడాది యాసంగిలో 8 తడులు అందించిన అధికారులు ఈ సారి 6 తడులకే పరిమితమయ్యే పరిస్థితి కనిపిస్తున్నది.

### ఆరుతడికే ప్రాధాన్యం

ప్రాజెక్టులో నీటి లభ్యతను బట్టి రైతులు సహకరించాలని అధికారులు కోరుతున్నారు. విడుదల చేసే నీటిని ఆరుతడి పంటలకే వాడుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రాజెక్టులో నీటి లభ్యత తక్కువగా ఉన్నదని, దీనికి తామేమీ చేయలేమని స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు ఎంత మేరకు సహకరిస్తారనే సందేహం వ్యక్తమవుతున్నది. ఆయకట్టు పరిధిలో ఇప్పటికే నారు పోసుకున్న రైతులు ప్రాజెక్టు నీటి కోసం ఎదురు చూస్తున్నారు. అల్గునూర్ నుంచి సూర్యాపేట వరకు నీరందిస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ, అది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. ఇచ్చే 4 వేల క్యూసెక్కులు కాలువ మొదట్లో ఉన్న రైతులకే సరిపోవని, చివరి ఆయకట్టుకు ఎలా చేరుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయకట్టు పరిధిలో ఈ సారి సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

### ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలి

ఎల్ఎండీ దిగువ ఆయకట్టుకు ఆదివారం సాయంత్రం 4 గంటలకు మంత్రి పొన్నం ప్రభాకర్ నీటిని విడుదల చేస్తారు. మొదటి ఏడు రోజులు దిగువ కాకతీయ కాలువ 146 కిలోమీటరు నుంచి 284వ కిలోమీటరు వరకు అందిస్తాం. ఆ తర్వాత 8 రోజులు 284వ కిలోమీటర్ దిగువ ఆయకట్టుకు నీరిస్తాం. మధ్య, దిగువ మానేరు జలాశయాల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్నది. స్టేజ్-1,2 పరిధిలో యాసంగి పంటలకు నీరు సరిపోయే పరిస్థితి లేదు. ప్రతి డిస్ట్రిబ్యూటరీకి సంబంధించి చివరి ఆయకట్టుకు సమృద్ధిగా నీరు అందే పరిస్థితి లేదు. ఆయకట్టు రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలి. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలి. నీటి పారుదల శాఖకు సహకరించాలి.

**- పీ శివకుమార్, ఎస్ఈ (ఇరిగేషన్ సర్కిల్ - 2)**

# వస్త్ర తయారీ ఆర్డర్లు సిరిసిల్లకే ఇవ్వాలి

- ఏడు విలీన గ్రామాలను తిరిగి పంచాయతీలుగా కొనసాగించాలి
- దివ్యాంగులకూ ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి
- ఆటో కార్మికులకు నెలకు రూ.10వేల భృతి ఇవ్వాలి
- కిరాయిదారులకు 200 యూనిట్ల వరకు విద్యుత్ రాయితీ కల్పించాలి
- 18 అంశాలపై సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం
- వివరాలు వెల్లడించిన చైర్‌పర్సన్ జిందం కళ

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ)/ సిరిసిల్లటౌన్: 'బతుకమ్మ, క్రిస్మస్, రంజాన్ లాంటి వస్త్ర ఉత్పత్తులు, కేసీఆర్ కిట్ బట్టల తయారీ, ఆర్‌వీఎం బట్టల తయారీ ఆర్డర్లు అధిక శాతం సిరిసిల్లకే ఇచ్చి నేతన్నలను ఆదుకోవాలి. సిరిసిల్లలో అధిక శాతం మంది పవర్‌లూం పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నందున సిరిసిల్లలో ఉన్న 20 వేల పైచిలుకు మరమగ్గాలకు 90శాతం విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలి' అని సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ కోరింది. శనివారం చైర్‌పర్సన్ జిందం కళ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నేత కార్మికులు, ప్రజల సంక్షేమం, పట్టణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని 18 అంశాలతో రూపొందించిన ఎజెండాను ప్రవేశపెట్టగా, సభ్యులు అన్ని అంశాలను చర్చించి ఆమోదించారు. ఏకగ్రీవంగా తీర్మానం చేసి, వాటి ప్రతులను ప్రభుత్వానికి పంపించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కమిషనర్ మీర్జా ఆలీబేగ్, టీపీవో అన్సారీ, సెస్ ఎండీ సూర్యచందర్‌రావు, సిరిసిల్ల ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ వివరాలను వెల్లడించారు.

### తీర్మానాలివే..

- నేతన్నల జీవన ప్రమాణాలు పెంపొందించేలా కేసీఆర్ సర్కారు అత్యధిక శాతం వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లు మరమగ్గాల పరిశ్రమకే ఇచ్చింది. అలాగే ప్రస్తుత ప్రభుత్వం ఆర్డర్లు ఇచ్చి కార్మికులను ఆదుకోవాలి.
- సిరిసిల్లలో ఎక్కువగా పవర్‌లూమ్‌పై పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. 14 వేల పైచిలుకు సాంచాలకు 90శాతం విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలి.
- 2018లో సిరిసిల్ల మున్సిపాలిటీలో విలీనం చేసిన ఏడు గ్రామాలను ప్రజల కోరిక మేరకు తిరిగి గ్రామపంచాయతీలుగా కొనసాగించాలి.
- ఆరు గ్యారంటీలలో భాగంగా ఇంటి కిరాయిదారులకు, అన్ని గృహ విద్యుత్ సర్వీసులకు గృహ జ్యోతి పథకం కింద 200యూనిట్ల రాయితీ ఇవ్వాలి.
- మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల సంఖ్య పెరిగినందున అందుకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలి.
- కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలి.
- మహిళలకు ఫ్రీ బస్సుతో ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతిన్నందున ఇస్తానన్న నెలకు ₹వెయ్యి జీవన భృతి వారికి ఏ మాత్రం సరిపోదని, ప్రస్తుత పరిస్థితులలో దానిని ₹10వేలకు పెంచాలి. భృతిని ఈ నెల నుంచే కార్మికులకు అందించాలి. ఇతర ఆదాయ మార్గాలను చూపాలి. ఇంకా ఆటో డ్రైవర్లకు రూ.5లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పించాలి.
- పట్టణంలో పార్కులు, జంక్షన్లు, సెంట్రల్ మీడియన్స్, గ్రీనరీ, వైకుంఠ ధామాలు ఇతరత్రా పనుల నిర్వహణకు టెండర్లు నిర్వహించాలి.
- వివిధ వార్డుల్లో ఉన్న పవర్ బోర్ల నిర్వహణ చూడాలి. రాజీవ్‌నగర్ ప్రజల కోరిక మేరకు అంబా భవాని ఆలయానికి ఇంటి నెంబర్‌ను కేటాయించాలి. ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపట్టాలి.
- ఇందిరానగర్, బీవైనగర్, పద్మనగర్ ఏరియాలోని ప్రభుత్వ పట్టా భూములు పొందిన లబ్ధిదారులకు పూర్తి యజమాన్య హక్కులు, క్రయ, విక్రయాలు చేసుకునే వీలు కల్పించాలి.

నమస్తే తెలంగాణ CLASSIFIED

HOUSE FOR SALE



★HYD-Begumpet, Shyamlal Building Nr. HPS, New Individual Semi-Commercial House Sale, 200 Sq.y., G+4 Floors & Floor-wise also Sale after completion Rent 3L p.m. for total Building. Ph: 9032015898, Owner. NT-313090

PLOT FOR SALE



★Residential Plot 2250 Sq. yards for Sale in Prime Residential Area at Near SRR College, Jagityal Road, Karimnagar Town. Ph: 9703544199. NT-324481

OWN BUSINESS OFFER



★18-28 సం॥ల యువతీ యువకులకు Rs. 49,000/- ల స్వల్ప పెట్టుబడిలోనే లోకల్ ఫ్రాంచైజీతో పర్మినెంట్ బిజినెస్ ఆదాయం. మల్టీసర్వీసెస్+ట్రైనింగ్+డైలీ సపోర్ట్ @ 15 సం॥ల నమ్మకమైన సర్టిఫైడ్ సంస్థ W.W.I-Hyd. Ph: 9908743603. NT-2580-All

CHANGE OF NAME

★I, VEMULA PRASOONA, D/o. Vemula Narsimha Reddy, R/o. 1-63, Gopalraopet, Ramadugu, Karimnagar, TS. Changed My Name as DASARI PRASANNA, W/o. Dasari Rajender Reddy. NT-319305

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571
91827 77194



కరీంనగర్: తెలంగాణ చౌక్ నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు వస్తున్న ఆటో డ్రైవర్లు

# కదంతొక్కిన ఆటో డ్రైవర్లు

- కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట మహాధర్నా
- మహిళలకు బస్ ఫ్రీ పథకంతో రోడ్డునపడ్డామంటూ ఆవేదన
- నెలనెలా రూ.15వేల జీవనభృతి, పథకాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్
- ప్రభుత్వం స్పందించకపోతే సీఎం క్యాంప్ ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరిక

కరీంనగర్ తెలంగాణచౌక్, డిసెంబర్ 30 : ఆటో డ్రైవర్లు కదం తొక్కారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరుకు నిరసనగా రోడ్డెక్కారు. మహిళలకు బస్సు ఫ్రీజర్నీకి అవకాశం ఇవ్వడంతో తమ బతుకులు ఆగమయ్యాయని, కుటుంబాలు గడువలేని పరిస్థితి నెలకొన్నదని, వెంటనే ఆదుకోవాలంటూ డిమాండ్ చేశారు. కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట మహాధర్నా చేపట్టారు. అంతకు ముందు తెలంగాణ చౌక్ నుంచి భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకొని, దాదాపు రెండు గంటల పాటు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బొమ్మడి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, తమ జీవన మనుగడ కోసం ఎలాంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మహాలక్ష్మి పథకాన్ని వ్యతిరేకించడం లేదని, కానీ ఉచిత ప్రయాణంతో రోజూ రూ.వెయ్యి సంపాదించి కుటుంబాన్ని పోషించుకునే ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతిన్నదని, రాష్ట్ర వ్యాప్తంగా 17లక్షలు, జిల్లాలో 15వేల కుటుంబాలు రోడ్డునపడ్డాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి కిరాయి, పిల్లల చదువు, ఆటో ఫైనాన్స్‌లు కట్టలేని పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు రవాణా శాఖ మంత్రిగా ఉన్న పొన్నం ప్రభాకర్ గతంలో జిల్లా ఆటో యూనియన్ సంఘానికి గౌరవ అధ్యక్షుడిగా పనిచేశారని, ఆయనకు మా బాధలు అన్నీ తెలుసునని, వెంటనే స్పందించి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. మహాలక్ష్మి పథకంతో ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులకు నెలకు ₹15వేల జీవన భృతి చెల్లించాలని, ఇంకా ఇందిరమ్మ ఇండ్లలో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, మహాలక్ష్మి పథకాన్ని పునః పరిశీలించాలని డిమాండ్ చేశారు. తమను ఆదుకోకుంటే రాష్ట్ర ఆటో డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో సీఎం క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. మహా ధర్నాలో నగర అధ్యక్షుడు రాజేందర్ నాయకులు శ్రీనివాస్, జనార్దన్, రవీందర్, నగర ఆటో డ్రైవర్లు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# అధైర్య పడద్దు.. అండగా ఉంటా

- అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలి
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్
- సారంగాపూర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

సారంగాపూర్, డిసెంబర్ 30: బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడద్దని, ఏ ఆపద వచ్చిన మీకు అండగా ఉంటానని అంటూ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యలపై పోరాడుతూనే ప్రభుత్వ పథకాలను ప్రజలందరికీ చేర్చాలని ఉద్బోధించారు. సారంగాపూర్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన మండల స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో కేసీఆర్ సర్కారు రాలేదని అధైర్యపడొద్దని సూచించారు. కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు తెలుసుకొని, పరిష్కరించేందుకు తమవంతు కృషి చేయాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, తనవంతుగా చీరెలు పంపిణీ చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి భోజనం చేశారు. అక్కడి నుంచి రేచపల్లి, కోనాపూర్ గ్రామాలకు వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. కాగా, ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తొలిసారి సారంగాపూర్‌కు వచ్చిన సంజయ్‌కుమార్‌ను స్థానిక నాయకులు ఘనంగా సత్కరించారు. కా ర్యక్రమాల్లో జడ్పీటీసీ మేడిపెల్లి మ నోహర్‌రెడ్డి, వైస్ఎంపీపీ సోల్లు సురేందర్, పా ర్టీ అ ధ్యక్షుడు గుర్రాల రాజేందర్‌రెడ్డి, ప్రధాన కా ర్యదర్శి తోడేటి శేఖర్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు మదన్‌కుమార్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు జోగినిపెల్లి సుధాకర్ రావు, విండో చైర్మన్ గురునాథం మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

## 'బాపు' పుస్తకం..
# నేటితరానికి ఆదర్శం



బాపు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కరీంనగర్ మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తదితరులు

- తండ్రీకొడుకుల మధ్య అనుబంధాన్ని చాటి చెప్పే గొప్ప రచన
- కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యుడు బీ వినోద్‌కుమార్
- మానకొండూర్‌లో బాపు పుస్తకం ఆవిష్కరణ సభ
- హాజరైన ప్రెస్‌అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, ప్రముఖులు

మానకొండూర్, డిసెంబర్ 30: తండ్రీకొడుకుల అనుబంధాన్ని కండ్లకుకట్టినట్టు జర్నలిస్ట్ గడ్డం సతీశ్ రచించిన 'బాపు' పుస్తకం నేటి తరానికి ఆదర్శనీయమని కరీంనగర్ మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్ ప్రశంసించారు. శనివారం మానకొండూర్‌లోని మీనాక్షి కన్వెన్షన్ హాల్‌లో నమస్తే తెలంగాణ సీనియర్ జర్నలిస్ట్ గడ్డం సతీశ్ రాసిన 'బాపు' పుస్తక ఆవిష్కరణ సభకు వినోద్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణతో కలిసి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ, రచయిత సతీశ్ తండ్రి గడ్డం రామస్వామి ఆశయం గొప్పదని కొనియాడారు. తాను చదువుకోకున్నా తన పిల్లలను చదివించడానికి ఆయన పడిన కష్టాలు, బాధలు వెలకట్టలేనిన్నారు. చదువుకుని మంచిగా ఉండాలని, సమాజంలో గౌరవంగా బతుకాలని తండ్రి చెప్పిన మాటలను తూచతప్పకుండా పాటించి ప్రయోజకుడైన కొడుకు, తండ్రీకొడుకుల మధ్య అనుబంధాన్ని చాటి చెప్పే ఈ పుస్తకం నేటి యువతరానికి స్ఫూర్తి దాయకమన్నారు. రాబోయే రోజుల్లో సమాజానికి ఉపయోగపడేలా.. నేటి తరానికి సామాజిక స్పృహ కలిగించే మరెన్నో రచనలు చేయాలని ఆకాంక్షించారు. ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ, ఒక సామాన్యుడిని అసామాన్యుడిగా తీర్చిదిద్దిన సతీశ్ ఆశయం గొప్పదన్నారు. తెలంగాణలో బాపు పిలుపునకు ఒక ప్రత్యేకత ఉందన్నారు. బాపు వ్యక్తిత్వాన్ని పుస్తక రూపంలో కండ్లకు కట్టినట్లు చెప్పాడని గుర్తు చేశారు. రామస్వామి పెద్దగా చదువుకోలేక పోయినా, తన పిల్లలు తనలా ఉండవద్దని ప్రయోజకులు కావాలని అతడు నిత్యజీవితంలో సాగించిన పోరాటం గొప్పదన్నారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ, సతీశ్‌తో తనకు ఉన్న అనుబంధం అన్నదమ్ముళ్లదని చెప్పారు. నేటి కాలంలో తండ్రుల ఆస్తులు, సంపాదన పంచుకుంటున్న వారు ఉంటున్నారని, కానీ సతీశ్ మాత్రం తండ్రి ఆశయాన్ని, ప్రేమను, జీవితాన్ని పంచుకున్నాడని గుర్తుచేశారు. తండ్రీకొడుకుల అనుబంధాన్ని చాటిన ఈపుస్తకాన్ని సినిమా గానీ, డాక్యుమెంటరీ గాని తీస్తానని వెల్లడించారు. మాజీ ఎమ్మెల్సీ నారాదాసు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ, బాపు యాదిలో పుస్తకాన్ని రచించిన సతీశ్‌ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు మాట్లాడుతూ, తండ్రీకొడుకుల ఆప్యాయతను కండ్లకు కట్టినట్లు పుస్తక రూపంలో చెప్పడం గొప్ప విషయమన్నారు. రచయిత సతీశ్ మాట్లాడుతూ, తన తండ్రి సామాన్యుడని, ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువేనని చెప్పారు. బాపు పుస్తకాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకువస్తానని అన్నారు. తనను అన్ని రకాలుగా ఆదుకుని సహాయ సహకారాలు అందిస్తున్న 'నమస్తే తెలంగాణ' యాజమాన్యానికి రుణపడి ఉంటానని కృతజ్ఞతలు తెలిపారు. ఇట్యాల వెంకటకిషన్ అధ్యక్షత వహించిన ఈ సభలో రాష్ట్ర ఈఆర్‌సీ చైర్మన్ తన్నీరు శ్రీరంగరావు, సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత సినీ విమర్శకులు వారాల ఆనంద్, రచయిత తల్లి గడ్డం అజ్జిరవ్వ, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, పలువురు కవులు, కథకులు జూకంటి జగన్నాథం, అన్నవరం దేవేందర్, కేఈవీ నరేందర్, గాజోజు నాగభూషణం, పెద్దింటి అశోక్‌కుమార్, బూర్ల వెంకటేశ్వర్లు, కూకట్ల తిరుపతి పాల్గొన్నారు.